క్లుప్తంగా

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

'ప్రభుత్వ భూముల్ని పరిరక్షించాలి'



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పరవాడ: పరవాడ గ్రామంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని గొర్లివానిపాలెం గ్రామానికి చెందిన చిప్పాడు రామారావు అధికారులను కోరారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభలో అధికారులకు వినతిపత్రం అందించారు. పరవాడలో నీటి ప్రవాహ భూములు, రుద్రభూమి, కొండలు, గుంటలు, వాగులు, పంట కాలువలు, ప్రభుత్వ రోడ్లు, పాఠశాలలు, దేవాలయాలను పరిరక్షించాలని ఆ వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పైల చినఅక్కునాయుడు, పైల బుజ్జి, పైల సత్యనారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి దేశపాత్రునిపాలెంలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా దేశపాత్రునిపాలెం, ఎస్సీ కాలనీ, సింహాద్రి నగర్, సంస్కృతిగ్లోబల్ స్కూల్ ఏరియా, స్నేహపురి కాలనీ శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని వెల్లడించారు.

కఠినంగా పోక్సో చట్టం అమలు అవసరం



ఎస్పీ తుహిన్ సిన్హాతో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు సీతారాం

అనకాపల్లి: జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని, బాలలపై జరిగే అకృత్యాలు అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హాను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పోక్సో కేసులో నిందితులకు తక్షణం శిక్ష పడేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, హైస్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి కె.అనంతలక్ష్మి, అనకాపల్లి సీడీపీవో ప్రభావతి, బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, పీవోఎస్ఐసీకేఎల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

మల్కాపురం: వచ్చే నెల 15న ఆర్‌కే బీచ్ సమీప గోకుల్ పార్కు వద్ద నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాల కరపత్రాలను జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు ఒమ్మి సన్యాసిరావు, బొట్ట వెంకటరమణ, ఉరుకూటి మహాలక్ష్మినాయుడు, పల్లా చిన్నతల్లి, తోనంగి వెంకటరమణి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పౌర్ణమి రోజున సాగరతీరంలో రాధాకృష్ణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆరంభంలో అనావృష్టి. చాలా చోట్ల చల్లిన విత్తనాలు మొలకెత్తని పరిస్థితి. కొన్ని చోట్ల బావులు, బోర్ల నీటి తడుతలతో మొలకెత్తినా నారుమడులు ఎండిన దుస్థితి. అన్నీ తట్టుకుని నాట్లు, వెద పద్ధతిలో ఖరీఫ్ వరి సాగు మొదలయ్యాక.. వరుస వర్షాలు పరవాడ మండల రైతుల్లో గుబులు పెంచాయి. అవన్నీ తట్టుకుని ప్రస్తుతం వరి చేలు పొట్ట, ఈనిక దశకు చేరుకున్నాయి. ఇప్పుడు 'దాన'తుపాను ప్రభావం రైతుల్ని భయపెడుతోంది. ఎన్నో ఆశలు పెంచుకుని సాగు చేస్తున్న **పంట చేతికందేనా? అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.**

వరుస వానలు.. వరి రైతుల్లో గుబులు



స్వయంభూవరంలో పొట్ట దశలో ఉన్న వరి

పరవాడ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని పరవాడ, స్వయంభూవరం, వెన్నలపాలెం, రావాడ, తానాం, భర్నికం గ్రామాల్లో సుమారు 384 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరుగుతోంది. చాలా వరకు రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు అనువైన విత్తనాలే వేశారు. ఆరంభంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి ఎద్దడిని తట్టుకునే రకాలపై దృష్టిసారించారు. ఆ తర్వాత వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆందోళన మొదలయింది.

అనువైన విత్తనాలే చల్లినా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మండలానికి అవసరమైన విత్తనాలు రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లకు చేరాయి. ఖరీఫ్ దుక్కుల సమయంలోనే ఆర్బీకే వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు తమ భూములకు అనువైన విత్తనాలనే ఎంచుకున్నారు. ప్రధానంగా సాంబమసూరి, ఆర్‌జీఎల్, ఎంపీయూ, ఆర్ఎస్ఆర్ రకాల విత్తనాలనే చల్లారు.

- అధిక దిగుబడి, తెగుళ్లను తట్టుకొనే బీపీటీ 5204(సాంబమసూరి)రకాన్ని 150 ఎకరాల్లో వేశారు. ఈ రకం వరి గాలుల్ని కొంత మేర తట్టుకుంటుంది.
- **ఆర్‌జీఎల్ 2537 రకం 128 ఎకరాల్లో వేశారు. అయితే ఈ రకం వరి నీరు అధికంగా ఉంటే పడిపోయే అవకాశాలు ఎక్కువ. ఈ రైతులు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు.**
- **ఎంపీయూ 1318 రకం 10 ఎకరాలు, ఆర్ఎస్ఆర్ 15048 రకం వరి విత్తనాలు 20 ఎకరాల్లో వేశారు.** ఈ రెండు రకాల వరి ఈదురుగాలుల్ని తట్టుకునే రకాలు కావడంతో రైతులు వాటి సాగుపై ఆసక్తి కనబర్చారు.
- మిగిలిన 76 ఎకరాల విస్తీర్ణంలో సాధారణ రకాలకు చెందిన వరి విత్తనాలను సాగు చేస్తున్నారు.



పరవాడలో ఈనిక దశకు చేరిన వరి

భారీ వర్షంపై ఆందోళన

ప్రస్తుతం స్వయంభూవరం, వెన్నలపాలెం, రావాడ **ప్రాంతాల్లో సాగు** చేస్తున్న వరి పంటలు పూత, **పొట్ట దశలో ఉన్నా**యి. పరవాడ, తానాం, భర్నికం **ప్రాంతాల్లో గింజలు** పాలుపోసుకునే దశకు చేరు**కున్నాయి. తుపాను** ఫలితంగా భారీ వర్షాలు కురిస్తే **పూత దశలో ఉన్న** వరికి ముంపు ఇబ్బందులు ఉం**టాయని రైతులు ది**గులు చెందుతున్నారు. అంతేకా**కుండా దిగుబడుల**పై కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ మోస్తరు వర్షాలైతే వరి దిగుబడులకు ఎలాంటి ఢోకా లేదని రైతాంగం భావిస్తోంది. తుపాను ప్రభావంతో వీచే భారీ గాలులతో వరి చేలు నేలకొరిగి, పంటలకు భారీ నష్టం తప్పదన్న భయం వెంటాడుతోంది.

తేలికపాటి వర్షాలైతే మేలు



ప్రస్తుతం భారీ వర్షాలు కురిస్తే పొట్ట దశలో ఉన్న వరి పంటకు తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయి. నేను పరవాడ పెద్ద చెరువు కింద రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం చేను పొట్ట దశలో ఉంది. అధికారులు చెప్తున్నట్లు తుపాను వల్ల భారీ వర్షాలు పడితే ఇబ్బందులు తప్పవు. తేలికపాటి వర్షాలైతే వరికి మేలు జరుగుతుంది.

– రెడ్డి అయ్యబాబు, రైతు, పరవాడ

చెరువులు పొంగిపొర్లితే కష్టమే..



స్వయంభూవరంలో నాకున్న రెండెకరాల్లో ఖరీఫ్ వరి పంట వేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాస్త ఏపుగా పెరిగి, పొట్ట దశకు చేరి ఆరోగ్యంగా ఉంది. మా పొలానికి ఎగువన రెండు చెరువులున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలు కురిస్తే, ఆ చెరువులు పొంగిపొర్లి దిగువనున్న పంట చేలకు ముంపు తప్పదు.

– బత్తిన వెంకటస్వామి, రైతు, స్వయంభూవరం

భారీ వర్షాలతో కొంత మేర నష్టం



మండలంలో రైతులు వేసిన వరి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో పొట్ట దశలో ఉన్నాయి. కొన్ని చోట్ల గింజ కట్టే దశకు చేరుకున్నాయి. భారీ వర్షాలైతే తప్ప, తేలికపాటి వర్షాలైతే ఎలాంటి ఇబ్బందులుండవు. గాలుల్ని తట్టుకుని, అధిక దిగుబడులిచ్చే రకాలనే రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వరి చేలు ఆరోగ్యంగా ఉన్నాయి.

– సీహెచ్ చంద్రావతి, వ్యవసాయాధికారి, పరవాడ

పంచగ్రామాల భూ సమస్యపై ఎంపీ భరత్‌కు వినతి



సమస్యను ఎంపీ భరత్‌కు వివరిస్తున్న సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘ కార్యదర్శి కృష్ణంరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూ సమస్యని పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచగ్రామాల్లోని కాలనీల అసోసియేషన్ నాయకులు ఎంపీ భరత్‌ని కోరారు. నగరంలో ఆయన్ని కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. సుమారు మూడు దశాబ్దాల నుంచి పంచగ్రామాల భూ సమస్యతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సొంత భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. దేవస్థానం దాడులతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యని వెంటనే పరిష్కరిచాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ పంచగ్రామాల భూ సమస్యపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారని, ఇటీవలే దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశం నిర్వహించిన విషయాన్ని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంపీని కలిసిన వారిలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు వీబీఎస్ ప్రతాప్, నాయకులు బి.శంకరరావు, హనుమంతరావు, జీవీ కృష్ణారావు, రామ, విజయకుమార్ తదితరులు ఉన్నారు.

వేపనూనెతో వరిలో తెగుళ్ల నుంచి రక్షణ



రావాడలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త పద్మావతి



తెల్ల జిల్లేడు ఆకుల ద్రావణ తయారీ విధానాన్ని వివరిస్తున్న సేంద్రియ వ్యవసాయ సిబ్బంది

పరవాడ: పాలు పోసుకొనే దశలో ఉన్న వరి చేలకు ముందస్తుగా 5 మి.లీ. వేపనూనెను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్త పద్మావతి సూచించారు. రావాడ, వాడచీపురుపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటల్ని పరిశీలించి, ఎలాంటి చీడపీడలు సోకలేదని నిర్ధారించారు. సేంద్రియ వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో వరి పంటలో స్థూల, సూక్ష్మ పోషకాల లోపాల నివారణకు తెల్ల జిల్లేడు ఆకుల ద్రావణాన్ని తయారు చేసే విధానాన్ని రైతులకు స్వయంగా చేసి చూపించారు. ఈ ద్రావణం తయారీకి 10 కిలోల తెల్ల జిల్లేడు ఆకులు, 10 లీటర్ల దేశవాళీ గోమూత్రం, 200 లీటర్ల నీటిలో కలిపి రెండు రోజులు నిల్వ ఉంచాలన్నారు. ఆ ద్రావణాన్ని వడకట్టి పంటలపై పిచికారీ చేయాలన్నారు. ఈ ద్రావణం పొటాషియం ధాతు లోపాన్ని నివారించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రకృతి సేద్య పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా వరిలో మంచి దిగుబడులు సాధించవచ్చని గ్రామ సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి, వీఏఏలు గౌతమి, అనిత, రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలకు రెక్కలు

- మోసపూరిత హామీలతో గద్దెనెక్కి దోచుకు తింటున్నారు
- సీపీఐ ఆధ్వర్యంలో నిరసన, కరపత్రాల పంపిణీ



నిత్యావసరాల ధరల పెరుగుదలపై వేపగుంట కూడలి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, ప్రజలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందకుండా పోతున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ఆక్షేపించారు. ఎన్నికల సమయంలో నిత్యావసరాల ధరలు పెరగకుండా, ప్రజలకు అండగా ఉంటామని గద్దెనెక్కిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు పాలనలో సామాన్యులు కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం సుజాతనగర్ కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిత్యావసర సరకుల ధరల పెరుగుదల తీరుపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓ వైపు తగిన విధివిధానాల్లేని ఇసుక పాలసీ కారణంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధికి దూరమైన సమయంలో భారీ స్థాయిలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం విచారకరమన్నారు. విజనరీగా చెప్పుకునే సీఎం చంద్రబాబుకు మోసం తప్ప ప్రజల బాగోగులు పట్టవని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలు పెరిగి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ కులాలు, మతాలు, దీక్షల పేరిట డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యావసరాల ధరలను అదుపులోకి తెచ్చేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి తీవ్రస్థాయిలో ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, పార్టీ ప్రతినిధులు దుర్గారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు.. ప్రయాణికుల అవస్థలు



పాత అడవివరం రావి చెట్టు వద్ద రోడ్డు దుస్థితి



పాత అడవివరం జంక్షన్‌లో గోతులమయంగా రోడ్డు

సింహాచలం: అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డులో పాత అడవివరం జంక్షన్‌లోను, జంక్షన్‌కి కూతవేటు దూరంలో ఉన్న రావిచెట్టు వద్ద రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు గుంతలు పడి, రాళ్లు తేలి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి, రోడ్డేదో.. గొయ్యేదో.. తెలియక గాయపడుతున్నారు. ముఖ్యంగా పాత గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు రెండు లైన్లలో బీఆర్‌టీఎస్ రోడ్డు తొలి విడత పనులు పూర్తయ్యాయి. ఇరువైపులా తారు రోడ్డు వేశారు. పాత అడవివరం జంక్షన్ వద్దనున్న రావిచెట్టు ప్రాంతానికి వచ్చేసరికి రోడ్డు పనులు జరగలేదు. ఏళ్ల తరబడి ఉన్న రావిచెట్టుని తొలగించవద్దంటూ పలువురు వృక్ష ప్రేమికులు కోరడంతో, ఆ ప్రాంతానికి వచ్చేసరికి రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో ఒక వైపు రోడ్డు మధ్యలో ఈ రావిచెట్టు ఉంది. దీని సమీపంలో రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఇటీవలి వర్షాలకు భారీ గోతులు ఏర్పడి, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

51 శాతం లాభాల్లో సెంట్రల్ బ్యాంకు

- సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో జీఎం ధారాసింగ్ నాయక్



సెంట్రల్ బ్యాంకు సబ్బవరం శాఖను ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్, తదితరులు

సబ్బవరం: సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా 51 శాతం లాభాలతో నడుస్తూ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందని సంస్థ జనరల్ మేనేజర్ కె.ధారాసింగ్ నాయక్ అన్నారు. సబ్బవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1911లో స్థాపించిన సెంట్రల్ బ్యాంక్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి 114 ఏళ్లు పూర్తి చేసుకుని, రూ.6.64 లక్షల కోట్ల టర్నోవర్‌తో ముందుకెళ్తోందన్నారు. కొత్తగా మరో 20 శాఖలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు రూ.2 కోట్ల వరకు రుణ సదుపాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.10 నాణేలు చెల్లవన్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ఖాతాదారులకు రూ.10 నాణేలను పంపిణీ చేశారు. సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. విశాఖ జిల్లాలో తమ బ్యాంక్‌కు చెందిన 38 శాఖల ద్వారా ఖాతాదారులు మెరుగైన సేవలందుకుంటున్నారని తెలిపారు. ముందుగా బ్రాంచ్‌ను ప్రారంభించి, సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీజీఎం ఏఎస్ఎన్ మూర్తి, సబ్బవరం బ్రాంచ్ మేనేజర్ ఎ.రమేష్, చీఫ్ మేనేజర్ జీవీ రవీంద్ర, సిబ్బంది అబ్దుల్ రెహమాన్, చందన్, శ్రీదేవి పాల్గొన్నారు.

వర్షాలతో కోతకు గురైన రోడ్డు



వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారి మలుపులో కోతకు గురైన రోడ్డు

పరవాడ: వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారిలో ఇటుకల బట్టీ సమీపంలో రోడ్డు కోతకు గురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రజలు నిత్యం వందల సంఖ్యలో ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. బొగ్గు ధూళి కారణంగా ప్రజలు ఊటగెడ్డ మీదుగా రాకపోకలు సాగించలేక వెన్నలపాలెం రోడ్డును ఆశ్రయిస్తున్నారు. రహదారిలో వాహనాల సంఖ్య రోజురోజుకీ పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సినిమా హాలు కూడలిలో ట్రాఫిక్ సమస్యలున్నప్పుడు ప్రయాణికులు వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారిని ఉపయోగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారిలో పలు చోట్ల రోడ్డు కోతకు గురైంది. భారీ గోతులు ఏర్పడ్డాయి. చీకటి పడితే రోడ్డు మలుపులో వాహనాలు జారిపోయి, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి వెన్నలపాలెం రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువల్లో వ్యర్థాలతో ప్రజల ఇబ్బందులు



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చెత్త పేరుకుపోయిన కాలువ

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కాలువల్లో చెత్త పేరుకుపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని కాలువలు చెత్తచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించడంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ దుస్థితి నెలకొందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో దోమల వ్యాప్తి పెరిగి, రాత్రుళ్లు కంటిమీద కునుకులేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టట్లేదని ఆక్షేపిస్తున్నారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి, కాలనీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, రోడ్ల పక్కన పోగేసిన చెత్త కుప్పల్ని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్థాయిలోనే రెవెన్యూ సమస్యల పరిష్కారం

- గొటివాడ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చిన్నికృష్ణ



రెవెన్యూ సదస్సులో సర్పంచ్ మీనాతో కలిసి రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా తక్షణ పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గొటివాడలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గత రీ సర్వేలో రైతుల భూ విస్తీర్ణాల నమోదులో పొరపాట్లు దొర్లినా, పేర్లు తప్పుగా నమోదైనా వాటిని రైతులు సరిచేసుకోందుకు ఈ సదస్సులను వినియోగించుకోవాలన్నారు. గొటివాడ రెవెన్యూ పరిధిలో 162 సర్వే నెంబర్లకుగాను మొత్తం 663.87 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 192.06 ఎకరాలు ప్రభుత్వ భూమి, 471.81 ఎకరాల జిరాయితీ భూమి ఉందన్నారు. కార్యక్రమంలో గొటివాడ సర్పంచ్ సాలాపు మీనా, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, గ్రామ పెద్దలు సాలాపు వెంకటేశ్వరరావు, బొండా సత్యారావు, సాలాపు సూరిబాబు, బొండా కల్యాణ్, వీఆర్వోలు వాత్సల్య, రామ అప్పారావు, వెలుగు సర్వేయర్ బి.రాంబాబు, గ్రామ సర్వేయర్లు ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచకుంటే ఉద్యమిస్తాం

మల్కాపురం: కోరమాండల్ పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కోరమాండల్ గేటు వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఏడేళ్ల క్రితం వేతనాలు పెంచుతామన్న ఒప్పందాన్ని, అమలు చేయకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ క్యాంటీన్‌లో సరైన భోజనం దొరక్క, అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించి న్యాయం చేయకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'తహసీల్దార్ ఆరోపణలు అవాస్తవం'



గొర్లె అచ్చెంనాయుడు

సబ్బవరం: స్థానిక తహసీల్దార్ ఆరోపించినట్లుగా ప్రభుత్వ భూములను తాము ఆక్రమించలేదని గొర్లి అచ్చెంనాయుడు తెలిపారు. తమ కుటుంబ సభ్యులు ఆక్రమణలకు పాల్పడ్డారంటూ మంగళవారం స్థానిక తహసీల్దార్ మీడియాకు వెల్లడించిన దాంట్లో వాస్తవం లేదన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి చెందిన తమపై కూటమి నేతలు కక్షపూరితంగా వ్యవహరిస్తూ, రెవెన్యూ అధికారుల్ని ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ ఆరోపించినట్లు ప్రభుత్వ భూములతో తమకు సంబంధం లేదన్నారు. సబ్బవరం సర్వే నెం.277/3లో 2.87 ఎకాల భూమి 1954 నుంచి సాగులో ఉంటూ, ప్రభుత్వానికి శిస్తులు చెల్లిస్తున్నామన్నారు. 1979లో తన తండ్రి గొర్లి చిన అప్పలనాయుడు పేరిట ప్రొసీడింగ్స్ ఇచ్చారని, తదనంతరం తన తల్లి అచ్చియ్యమ్మ పేరిట 2004లో పట్టాదార్ పాస్‌బుక్, టైటిల్ డీడ్, 1బీ, ఈ పాస్ బుక్ కూడా ఇచ్చారన్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భూములను సబ్ డివిజన్ చేసుకోలేరని, రెవెన్యూ అధికారులే సబ్ డివిజన్ చేసి తమకు అప్పగించారని వెల్లడించారు. తమకు అన్ని హక్కులు ఉన్నప్పటికీ ప్రభుత్వ భూమి అక్రమించారనడం సరికాదన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.